సాక్షి
శ్రీకాకుళం

శనివారం । 4 । అక్టోబర్ । 2025



ఆటో డ్రైవర్లపై ఆంక్షల కత్తి

ఆటో డ్రైవర్లపై ఆంక్షల కత్తి పెట్టారు. పథకాన్ని అందుకునే వీల్లేకుండా పోయింది.

- 10లో



8 నుంచి ఆధార్ శిబిరాలు

పోస్టాఫీసుల్లో 8వ తేదీ నుంచి ఆధార్ శిబిరాలు మొదలుకానున్నాయి. ఏర్పాట్లు పూర్తయ్యాయి.


- 10లో



కార్మికుడిని రక్షించిన పోలీసులు

సోంపేట: బారువ–మూల పొలం గ్రామాల మధ్యన కొత్త వంతెన వద్ద వరదలో ఒడిశాకు చెందిన నవీన్ మాజీ చిక్కుకుపోయాడు. స్తంభాన్ని పట్టుకుని ఉండిపోయాడు. మత్స్యకారుల సహకారంతో పోలీసులు, మెరైన్ సిబ్బంది కాపాడారు.

వంశధార ఉద్ధృతితో నీట మునిగిన మాతల గ్రామ పరిసరాలు



మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లు)	మండలం	వర్షపాతం (మిల్లీమీటర్లు)
		రణస్థలం	59.4
		కవిటి	57.2
పలాస	167.8	పోలాకి	56.2
మందస	163.6	లావేరు	47.8
వజ్రపుకొత్తూరు	136.4	ఆమదాలవలస	45.0
నందిగాం	117.2	హిరమండలం	44.6
కోటబొమ్మాళి	98.4	జి.సిగడాం	44.0
మెళియాపుట్టి	93.8	ఎల్ఎన్‌పేట	41.8
టెక్కలి	93.0	సరుబుజ్జిలి	41.4
కంచిలి	92.2	ఎచ్చెర్ల	40.6
సంతబొమ్మాళి	90.2	ఇచ్ఛాపురం	40 .0
పాతపట్నం	85.0	సారవకోట	35.2
సోంపేట	71.0	జలుమూరు	31.4
బూర్జ	68.6	శ్రీకాకుళం	25.8
గార	60.8	పొందూరు	25.6
నరసన్నపేట	60.0	కొత్తూరు	21.0

వరద ఉత్పాతం

దసరా సరదాను ముంచేసిన వరద

- జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులతో భారీ వర్షాలు
- చివురుటాకులా వణికిన సిక్కోలు
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- అంధకారంలో గ్రామాలు
- ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు
- గొట్టా బ్యారేజీకి భారీగా వచ్చి.. ఆపై తగ్గిన వరద

ఎడతెరిపి లేని వర్షం కాలువలు, రోడ్లను ఏకం చేసింది. నదులు, వాగులు, వంకలను ఉప్పెనలా ఊళ్లపైకి తరిమింది. నదీతీర గ్రామాలు ముంపు ముట్టడిలో చిక్కుకున్నాయి. మొత్తంగా తీవ్ర వాయుగుండం జిల్లాను అతలాకుతలం చేసింది. అందరూ దసరా సరదా, సందడిలో ఉన్న తరుణంలో విరుచుకుపడి ఆ సరదాలు, సంతోషాలను ఊడ్చేసింది. దాదాపు 23 ఏళ్ల తర్వాత దసరా రోజు వాన ముట్టడించింది. దాని ధాటికి వంశధార, నాగావళి, బాహుదా నదులు ఉగ్రరూపం దాల్చి.. పలు తీర గ్రామాలను దిగ్బంధించాయి. రహదారులను ఏరులుగా మార్చేసి, కోతకు గురిచేశాయి.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి తీర దాటే సమయంలో వరుణుడు బీభత్సం సృష్టించాడు. బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు ఏకధాటిగా ఈదురుగాలులతో కురిసిన వర్షాలకు సిక్కోలు చివురుటాకులా వణికిపోయింది.

పలాసలో అత్యధిక వర్షపాతం..

రెండు రోజులుగా జిల్లా అంతా కలిసి 2055 మిల్లీమీటర్ల వర్షం పడింది. పలాసలో అత్యధికంగా 167.8 మిల్లీమీటర్లు, మందసలో 163.6 మిల్లీమీటర్లు, వజ్రపుకొత్తూరులో 136.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తీవ్ర వాయుగుండం కారణంగా జిల్లాలోని నదులు ఉగ్రరూపం దాల్చాయి. వంశధారలో అత్యధికంగా వరదనీరు ప్రవహించడంతో గొట్టా బ్యారేజ్‌లోకి నీటి మట్టం పెరిగింది. మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తర్వాత ఇన్‌ఫ్లో తగ్గి మొదటి ప్రమాద హెచ్చరికకు పరిమితం చేశారు. భారీ వర్షాలకు ఉత్తరాంధ్రలో ఎత్తైన గిరిజన గ్రామాలైన కేరాసింగి, గూడ గ్రామాలకు వెళ్లే రహదారులు కోతకు గురై రాకపోకలు నిలిచిపోయాయి. అదే రహదారిలో కొండ చరియలు విరిగిపడి పెద్ద పెద్ద రాళ్లు రోడ్లుపైకి వచ్చేశాయి.



శ్రీకాకుళం నగరంలో నాగావళి పరవళ్లు

నష్టం ఇలా..

- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఇల్లు వరద నీటి ముంపునకు గురైంది.
- మందస మండలం హంసరాలి పంచాయతీ సవర టబ్బూరులో ఇల్లు కూలి సవర బుద్దయ్య, రూపమ్మ అనే దంపతులు మృతి చెందారు. అలాగే పలాస మొగిలిపాడు గ్రామానికి చెందిన సైని గోపాలరావు వరద నీటిలో మునిగి చనిపోయారు.
- వజ్రపుకొత్తూరు మండలం కొండూరు నుంచి బెండి వెళ్లే తారు రోడ్డు జలదిగ్బంధమైంది.
- నందిగాం మండలం ఉయ్యాలపేట గ్రామం నీట మునిగింది. ఈ సమయంలో ఒకరికి ఆరోగ్యం బాగులేకపోవడంతో నీటిలో మోసుకుంటూ గ్రామస్తులు ఆస్పత్రికి తీసుకెళ్లారు.
- వజ్రపుకొత్తూరు మండలం పెద్ద బొడ్డపాడు, సీతాపురం, కొండవూరు ప్రాంతాల్లో బెండి గెడ్డ వరద ఉద్ధృతితో పొంగి ప్రవహించింది.
- పాతపట్నం మండలం చంగుడి గ్రామ రహదారిపై మహేంద్ర తనయ వరదనీరు పొంగి ప్రవహించింది.
- పూండి, ఉద్దానం ప్రాంతంలో జీడి తోటల్లో వరద నీరు నిలిచిపోయింది.
- వజ్రపుకొత్తూరు మండలంలో రైల్వే అండర్ పాసేజ్ నీటితో నిండిపోయింది.
- పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి వరహాల గెడ్డ పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- పలాస మండలం కంపిరిగాం వద్ద పైనుంచి దేశబట్టి నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

వాన.. హైరానా..




జలుమూరు: అంధవరం పంచాయతీ రామకృష్ణాపురంలో కురిసిన వర్షాలకు రేగాన తులసమ్మ ఇల్లు కూలిపోయింది. తులసమ్మ ఆరుబయటకు రావడంతో ప్రమాద తప్పింది.



వజ్రపుకొత్తూరు: తాడు సాయంతో రోడ్డు దాటుతున్న శివరాంపురం గ్రామస్తులు



టెక్కలి: వృద్ధుడిని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అవస్థలు



సరుబుజ్జిలి: పురుషోత్తపురం ఇసుక ర్యాంపు వద్ద నీట మునిగిన పొక్లెయినర్



రణస్థలం: మండలంలో భారీగా పంట నష్టం వాటిల్లింది. అరటి, మొక్కజొన్న వంటి పంటలు నేలకొరిగాయి.



పలాస: నీట మునిగిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఇల్లు



జి.సిగడాం: ధవళపేట వద్ద చెట్టును తొలగిస్తున్న దశ్యం



శ్రీకాకుళం నగరంలో నీట మునిగిన గోవిందనగర్ కాలనీ

11 మండలాల్లో విద్యుత్‌కు దెబ్బ

- రూ.30 లక్షల వరకు నష్టం
- కూలిన 80 విద్యుత్ స్తంభాలు

అరసవల్లి: జిల్లాలో కురిసిన వానలకు 11 మండలాల్లో విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లింది. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, పలాస, నందిగాం, సంతబొమ్మాళి, జలుమూరు, నరసన్నపేట, పొందూరు, ఆమదాలవలస రూరల్, శ్రీకాకుళం నగరం, శ్రీకాకుళంరూరల్ తదితర మండలాల్లో మొత్తం 44 వరకు 11 కేవీ, 33 ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు నేలకూలగా, పాక్షికంగా సుమారు 20 వరకు విద్యుత్ స్తంభాలు కూలిపోయా యి. సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులను చేపట్టగా...సంస్థకు చెందిన మొత్తం 505 మంది ఎనర్జీ అసిస్టెంట్లు, 345 మంది కాంట్రాక్టు కార్మికులతో నష్టనివారణ చర్యలను చేపట్టారు. దసరా రోజున కురిసిన వర్షాలతో పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆయా ప్రాంతాల్లో అంధకారం నెలకొంది. శుక్రవారం సాయంత్రానికి ఇంకా 376 ఇళ్లకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పూర్తి కాలేదు. భారీ వర్షాల కారణంగా స్థానిక సర్కిల్‌కు సుమారుగా రూ. 30 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లుగా సమాచారం. సుమారుగా 80 వరకు విద్యుత్ స్తంభాలతో పాటు పలు చోట్ల డీటీఆర్ (ట్రాన్స్‌ఫార్మర్లు) కూడా కాలిపోవడం, అలాగే ఎచ్చెర్ల సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురికావడంతో దసరా రోజంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరాను మాత్రం అత్యధిక శాతం పునరుద్ధరించినట్లుగా ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి ప్రకటించగా.. ఇంకా చాలా చోట్ల ఎల్‌టీ విద్యుత్ కనెక్షన్ల పునరుద్ధరణ పనులు చేయాల్సి ఉన్నట్లుగా గుర్తించారు.



శ్రీకాకుళం మహిళా డిగ్రీకళాశాలలో విరిగిన విద్యుత్ స్తంభం

ముందస్తు ఏర్పాట్లలో జాప్యం



కంట్రోల్ రూంలో పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: భారీ వానలకు సిక్కోలు తడిచి ముద్దైపోయింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, దీని ప్రభావం జిల్లాపై ఉంటుందని వాతావరణ కేంద్రం ఒకటో తేదీ 11 గంటలకే హెచ్చరించింది. కానీ జిల్లా యంత్రాంగం ఆ రోజు రాత్రి 8.30 గంటల వరకు ప్రసార మాధ్యమాలకు సమాచారం ఇవ్వలేదు. ముందస్తుగా సమాచారం అంది ఉంటే కొంత మందైనా అప్రమత్తమయ్యేవారు. వానలకు దాదాపు 68 గ్రామాల్లో సుమారు 12 వేల ఎకరాల్లో వరి నీట మునిగింది.

కొనసాగుతున్న కంట్రోల్ రూమ్

కలెక్టరేట్ కార్యాలయంలో ఈ వరదలపై కంట్రోల్ రూమ్ కొనసాగుతోంది. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు వివరాలు, నష్టాలు, ప్రస్తుత పరిస్థితులపై సమీక్షిస్తున్నారు.

నష్టాలపై ప్రాథమిక అంచనా

- జిల్లాలో 3178 హెక్టార్లలో నష్టం వాటిల్లింది. ఇందులో హార్టీకల్చర్ 34 హెక్టార్లు.
- వరద ప్రభావం ఉన్న గ్రామాలు 68.
- జిల్లాలో రెండు ఎస్‌డీఆర్ఎఫ్ టీమ్‌లు సిద్ధంగా ఉన్నాయి.
- వాటర్ బోట్లు 6 సిద్ధం చేశారు.
- 86 పునరావాస కేంద్రాలు సిద్ధం చేసి 35 మందిని తరలించారు. మరో 35 మందికి రిలీఫ్ క్యాంపులో ఉంచారు.
- 850 ఆహారం ప్యాకెట్లు సిద్ధం చేశారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్
08942-240557

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్, ఎస్పీ



అల్లెన గ్రామంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బూర్జ: మండలంలో గల అల్లెన గ్రామాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి గురువారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా నాగావళి నదిలో నీటి ప్రవాహాన్ని, నది ఒడ్డు గ్రామమైన అల్లెన గ్రామాన్ని ఆయన పరిశీలించారు. లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని స్థానిక తహసీల్దార్ వైవీ పద్మావతి, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఎగువ భాగాన వర్షాలు బాగా పడుతున్నందున వరదలు వచ్చే ప్రమాదం ఉన్నందున నాగావళి నది ప్రవాహాన్ని పరిశీలించి సమాచారం తెలియజేయాలన్నారు.

శ్రీకాకుళం క్రైమ్ : తీవ్ర వర్షాభావంతో జిల్లాలోని వంశధార నది ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లాలోని నదీ పరివాహక ముంపు ప్రాంతాలను ఎస్పీ స్వయంగా వెళ్లి పరిశీలించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు సురక్షిత ప్రదేశాల్లో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అవసరమైతే సహాయక శిబిరాలు, ఆహార పంపిణీ, వైద్య సహాయం తక్షణమే అందేలా చూడాలన్నారు. వాగులు, వంతెనల వద్దకు వెళ్లరాదని ఎస్పీ సూచించారు.



తెలికిపెంట గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎస్పీ

పంచాయతీ రాజ్ శాఖ నష్టం రూ.45 కోట్లు

- జిల్లాలో 75 కిలోమీటర్ల మేర దెబ్బ తిన్న రహదారులు
- దారుణంగా దెబ్బ తిన్న రోడ్లు 10
- పాక్షికంగా పాడైపోయినవి 80

అరసవల్లి: భారీ వర్షాలతో జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖకు చెందిన పలు గ్రామీణ రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాజా అంచనాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖకు చెందిన రోడ్లు తీవ్రంగా 10, పాక్షికంగా మరో 80 వరకు దెబ్బతిన్నాయి. వీటి నష్టాన్ని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు అంచనాలను తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించనున్నారు. జిల్లాలో 8 నియోజకవర్గాల్లో సుమారు 53 కిలోమీటర్ల పొడవు మేర దెబ్బతిన్న 10 రహదారుల నష్టం రూ.39.50 కోట్లు వరకు ఉండగా, మిగిలిన సుమారు 20 కిలోమీటర్ల పొడవు మేర 80 రహదారుల పాక్షిక మరమ్మతులకు సుమారు రూ.5.50 కోట్లు వరకు ఖర్చు అయ్యే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. అలాగే హిరమండలం, పాతపట్నం, నరసన్నపేట, కొత్తూరు, సరుబుజ్జిలి తదితర మండలాల్లో వరద ముంపులో ఉన్న రోడ్లు పరిశీలించలేదు. ఇలా మరో 15 రోడ్ల వరకు అదనంగా ఉన్నట్లు సమాచారం.



కొత్తూరు: కేరాసింగిగూడు దారి పరిస్థితి



రణస్థలం: అదపాక-గుర్రాలపాలెంలో రోడ్డుపై వరద నీటిలో జనం అవస్థలు


వరద ఖాతాలో...పాత రహదారులు

కూటమి ప్రభుత్వం వచ్చాక రహదారుల నిర్మాణాలకు, మరమ్మతులకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదని తెలిసిందే. దీంతో చాలా చోట్ల రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో తాజా ప్రకృతి వైపరీత్యాన్ని నాయకులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గానికి కనీసం పదేసి రోడ్లు గుర్తించి వరద నష్టం జాబితాలో తోసేయాలని కూటమి నాయకులు అధికారులకు హుకుం జారీ చేశారు. అలాగే నష్టం అంచనాలను కూడా పెంచేస్తూ.. వరద విపత్తు ద్వారా నిధులను మంజూరు చేయించుకుని.. తద్వారా తమకు అనుకూలమైన వారికి కాంట్రాక్టులను కట్టబెట్టేలా పావులు కదుపుతున్నారని సమాచారం.



మడపాం వంతెన వద్ద ఉద్ధృతంగా ఉన్న వంశధార నది ప్రవాహం

నరసన్నపేట: వంశధార నది ఉగ్ర రూపం దాల్చింది. ఐదారేళ్లుగా ఎప్పుడూ లేనంత ఉగ్రంగా ప్రవహించింది. లక్షా 5 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహంతో నదీతీర గ్రామాల ప్రజలు భీతిల్లారు. కామేశ్వరిపేట, మడపాం, బుచ్చిపేట, పోతయ్యవలస, గోపాలపెంట, చేనులవలస, లుకలాం గ్రామాల్లో నది ఒడ్డున ఉన్న జీడి తోటల్లోకి వంశధార వరద నీరు వచ్చింది. మడపాం వద్ద నది ఉద్ధృతంగా ప్రవహించింది. బుచ్చిపేట–ముషిడిగట్టుల మధ్య రాకపోకలు స్తంభించాయి. బుచ్చిపేట వద్ద గెడ్డ రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. గెడ్డవానిపేట, కొబగాం, వెంకటాపురం ప్రజలు ఆందోళన చెందారు.





ఇచ్ఛాపురం రూరల్: ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బాహుదా నది

ఇచ్ఛాపురం రూరల్: భారీ వర్షాలకు బాహుదా ముంచెత్తింది. బాహుదాలో శుక్రవారం ఉదయం నాటికి 13,138 క్యూసెక్కుల నీరు చేరినట్లు తహసీల్దార్ ఎస్.వెంకటరావు తెలిపారు. దండుగెడ్డ, పద్మపురం గెడ్డలు ఉప్పొంగడంతో ఇన్నేశుపేట నీట మునిగింది. తులసిగాం, బూర్జపాడు, పాత శాసనాం, లొద్దపుట్టి గ్రామాల్లో 311 ఎకరాల వరి పంట నీట మునిగినట్లు సీనియర్ వ్యవసాయాధికారి పీపీవీవీ అజయ్‌కుమార్ తెలిపారు. బిర్లంగి తోటూరు గ్రామ సమీపంలో 24 మేకలు, గొర్రెలు వరదలో కొట్టుకుపోయాయి. నదీ పరివాహక ప్రాంతం వద్దకు ఎవ్వరూ వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు.

క్లుప్తంగా

8 నుంచి ఆధార్ శిబిరాలు

శ్రీకాకుళం అర్బన్ : ఈ నెల 6 నుంచి 10 వరకు జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తపాలాశాఖ సూపరింటెండెంట్ వి.హరిబాబు శుక్రవారం తెలిపారు. శ్రీకాకుళం డివిజన్ ప్రజలకు ఆధార్ నమోదు, అప్‌డేట్ సేవలు అందించేందుకు ఈ నెల 8 నుంచి 14 వరకు డివిజన్ అంతటా ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, టెక్కలితో పాటు రాజాం, కొత్తూరు, పొందూరు, కోటబొమ్మాళి, హిరమండలం సబ్ పోస్టాఫీసుల్లో శిబిరాలు సాగుతాయని వివరించారు. కాశీబుగ్గ, పాతపట్నం, శ్రీకాకుళం పాఠశాలల్లో శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు.

స్వచ్ఛంద సేవకులు ముందుకు రావాలి

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలో వర్షాలు, వరద ముంపు తాకిడి అధికంగా ఉన్నందున ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సేవలు అందించేందుకు యువకులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు శుక్రవారం పిలుపునిచ్చారు. జిల్లా, మండలాల స్థాయిలో వైపరీత్యాల నష్ట నివారణ కమిటీ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామని తెలిపారు. గతంలో ప్రథమ చికిత్స శిక్షణ పొందినవారు, రెడ్‌క్రాస్ పాట్రన్స్, జీవిత కాల సభ్యులు వైస్ పేట్రన్స్, లైఫ్ అసోసియేట్స్, గతంలో సేవలందించిన వైపరీత్యాల కమిటీ సభ్యులు, 18 నుంచి 40 ఏళ్లలోపు ఆరోగ్యవంతులు ముందుకు రావాలని కోరారు. వివరాలకు 9440490525, 9948633398 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

చెట్టుపడి వాహనదారుడికి గాయాలు



గాయపడిన బోర నీలం

పోలాకి : వాహనచోదకుడిపై చెట్టుపడటంతో తీవ్రంగా గాయపడిన ఘటన పోలాకి మండలం రాళ్లపాడులో చోటు చేసుకుంది. నరసన్నపేట-పోలాకి ప్రధాన రహదారిలో రాళ్లపాడు వద్ద రహదారికి ఆనుకుని కొన్ని తాటిచెట్లు ఉన్నాయి. అందులో ఓ చెట్టు కొన్నాళ్ల క్రితమే పిడుగుపాటుకు గురై ప్రమాదకరంగా మారింది. గురువారం అటుగా బైక్‌పై వెళ్తున్న రాళ్లపాడు గ్రామానికి చెందిన బోర నీలం అనే వ్యక్తిపై తాటిచెట్టు అకస్మాత్తుగా పడింది. దీంతో తీవ్రంగా గాయపడినట్లు కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపారు. అయితే, చెట్టు రహదారిపై పడిన తరువాత వాహనచోదకుడు చూసుకోకుండా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు, రెవెన్యూ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఏదిఏమైనా అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనే డ్వాక్రా రుణాల చెల్లింపు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

రణస్థలం: డ్వాక్రా సంఘాల సభ్యులు ఇకపై డిజిటల్ మోడల్ కాంటెక్స్ ప్రోటోకాల్ (ఎంసీపీ) ద్వారా బయోమెట్రిక్ వేసి ఆన్‌లైన్ విధానంలో రుణాలు చెల్లించాలని స్త్రీ నిధి ఇన్‌చార్జి బ్యాంకు లింకేజీ డైరెక్టర్ జి.వి.బి.డి.హరిప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు మండలం తాళ్లవలసలో గ్రామ సంఘ సభ్యులకు డిజిటల్ ఎంసీపీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణ వాయిదాలు సకాలంలో చెల్లించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాలన్నీ ఎంసీపీ జమ చేస్తామన్నారు. సంఘ సభ్యురాలికి అవసరమైన మొత్తం ఎన్యుమరేటర్ లాగిన్‌లో యాన్యుల్ క్రెడిట్ ప్లాన్ తయారు చేసుకోవడానికి రెండు రోజులు అవకాశం ఉందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ లింకేజీ డీపీఎం ఏ.నాగలక్ష్మి, ఎల్‌హెచ్ డీపీఎం బి.నారాయణరావు, స్త్రీ నిధి ఏజీఎం వి.సత్యనారాయణ, ఏపీ ఎం బి.వి.సుబ్బయ్యనాయుడు, స్త్రీ నిధి మేనేజర్ కునుకు ఉదయ్‌కుమార్, సీసీలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని 17 గొర్రెలు మృత్యువాత



మృతిచెందిన గొర్రెలు

రణస్థలం: లావేరు మండలం సుభద్రపురం సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని 17 గొర్రెలు మృతి చెందాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభద్రపురం గ్రామానికి చెందిన కోరాడ కోటేశ్వరరావు గొర్రెల మందను శుక్రవారం చీపురుపల్లి వైపు తోలుతుండగా శ్రీకాకుళం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో 17 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఘటనా స్థలాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పరిశీలించి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. లావేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్లపై ఆంక్షల కత్తి!

- నేటి నుంచి 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం అమలు
- నిబంధనలతో తగ్గిన లబ్ధిదారులు
- స్త్రీ శక్తి పథకంతో ఇప్పటికే బతుకులు దుర్భరం



ఈయన పేరు బొడ్డేపల్లి వెంకటరమణ. బూర్జ మండలం హనుమయ్యపేట. ఈయనకు ఏపీ 39యూహెచ్ 6031 నంబతో ఆటో ఉంది. ఈయన తండ్రి బొడ్డేపల్లి పోలినాయుడుకు పెరాలసిస్ ఉండేది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో తన తండ్రికి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుడిగా పింఛన్ వచ్చేది. వెంకటరమణకు వాహన మిత్ర కింద ప్రతిడాది ప్రభుత్వం పథకం అందజేసింది. ఆరు నెలల క్రితం తండ్రి పోలినాయుడు మరణించారు. కానీ, కూటమి ప్రభుత్వం ఈయన తండ్రి పింఛను పొందుతున్నారని రికార్డులో చూపిస్తూ వెంకటరమణను ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి అనర్హుడిగా పక్కన పెట్టేసింది. తాజాగా విడుదల చేసిన జాబితాలో ఆయన పేరు చూపించడం లేదు. ఇప్పుడుకటరమణ ఆవేదన చెందుతున్నారు. తండ్రి చనిపోయినా.. ఫింఛన్ పేరుతో తనకు రావా సాయాన్ని దూరం చేశారని మండిపడుతున్నారు. ఇలాంటి ఆంక్షలెన్నో ఆటో డ్రైవర్ల సేవలో పథకంలో కన్పిస్తున్నాయి. ఎంతో మంది అర్హతను కోల్పోయారు. కొత్తగా పొందాల్సిన వారు దూరమయ్యారు. ఇంట్లో ఒకరికే ఇచ్చే పింఛన్‌కు, ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద ఇచ్చే సాయానికి లింకు పెట్టడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

అసలే అంతంత మాత్రం బతుకులు.. నిబంధనల పేరుతో అడుగడుగుడునా వేధింపులు.. ఆపై జరిమానాలు.. పెట్రో, డీజిల్ మంటలు.. నెల తిరిగే సరికి అప్పుల వారి ఒత్తిళ్లు.. ఫైనాన్స్ కంపెనీల సతాయింపు.. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం పడిగాపులు.. మరమ్మత్తుల కోసం ఆర్థిక ఇబ్బందులు.. ఇవీ ఆటో, ట్యాక్సీ, మేక్సీక్యాబ్ యజమానుల కష్టాలు. వైఎస్సార్ సీపీ పాలనకు ముందు ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా వారి తల రాతలు మారలేదు. ఈ నేపథ్యంలో పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వాహన మిత్ర పథకం అమలు చేశారు. ఆటో, ట్యాక్సీ కార్మికులకు ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆటో వాలా బతుకులు మళ్లీ మొదటికొచ్చాయి. పదవుల్లోకి వచ్చి 15 నెలలైనా వీరిని పట్టించుకోలేదు. ఒక్క రూపాయి ఇవ్వలేదు సరికదా స్త్రీ శక్తి పథకం అమలుతో వారి ఆదాయానికి గండికొట్టారు. ఇప్పుడు పరిస్థితి దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ నిలదీయడమే కాకుండా ఆటో, ట్యాక్సీ వాలాలకు అండగా నిలిచి ఆందోళన చేయడంతో కూటమి ప్రభుత్వం దిగొచ్చింది. ఎట్టకేలకు 'ఆటో డ్రైవర్ల సేవలో..' పథకం అమలుకు ఉపక్రమించింది. మిగతా పథకాల మాదిరిగానే దీంట్లో కూడా లబ్ధిదారుల కోత పెట్టింది.

కోతల ప్రభుత్వం..



స్త్రీ, శక్తి పథకంతో ఆటో, ట్యాక్సీ వాలాలు చాలాచోట్ల రోడ్డున పడ్డారు. ప్రయాణికులు దూరం కావడంతో పోషణ, ఫైనాన్స్, ఇతరత్రా ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రత్యామ్నాయం సాయం చేయలేదు. సంవత్సరానికి రూ. 15వేలు చొప్పున ఇస్తామన్న ఆటో డ్రైవర్ల సేవలో పథకం లబ్ధిదారుల్లో కూడా కోత పెట్టింది. సాధారణంగా ప్రతి ఏటా ఏ పథకమైనా లబ్ధిదారులు పెరుగుతారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకక ఆటోవాలాలైతే మరింత పెరుగుతున్నారు. ఈ లెక్కన గత ప్రభుత్వంలో వాహన మిత్ర కింద ఇచ్చిన లబ్ధిదారుల కన్న సంఖ్య ఎక్కువగా ఉండాలి. కూటమి ప్రభుత్వంలో మాత్రం ఆటో వాలాల లబ్ధిదారులను తగ్గించేశారు. గత ప్రభుత్వంలో 14,320మందికి వాహన మిత్రం పథకం కింద సాయం అందజేయగా, ఈ ప్రభుత్వం 13,886 మందిని మాత్రమే లబ్ధిదారులగా ఎంపిక చేసింది. వీరిలో ఎంత మందిక జమవుతుందో తెలియని పరిస్థితి. ఇప్పటికే ఒక సంవత్సరం ఎగ్గొట్టడంతో ప్రతీ ఒక్కరూ రూ.15వేలు కోల్పోయారు. ఇప్పుడు ఆంక్షల పేరుతో సుమారు 500 మందిని తీసేశారు. ఇక, కొత్తగా ఆటో, ట్యాక్సీలు తీసుకున్న వారు వేలల్లో ఉన్నారు. ఈ లెక్కన సంఖ్య మరింత పెరగాలి. కానీ, ఏదో రకంగా తప్పించుకోవాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవలో కూడా దగా చేసింది.

స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ఇద్దరికి చోటు

- సభ్యులుగా గొండు కృష్ణమూర్తి, చల్లా శ్రీనివాస్ నియామకం
- వైఎస్సార్ సీపీలో అందించిన సేవలకు గుర్తింపు
- ఇద్దరూ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాల వారే



గొండు కృష్ణమూర్తి



చల్లా శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో జిల్లా నుంచి ఇద్దరికి చోటు లభించింది. పార్టీకి అందించిన సేవలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా గొండు కృష్ణమూర్తి, చల్లా శ్రీనివాసరావులను నియమిస్తూ రాష్ట్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిద్దరూ రాజకీయ నేపథ్యం ఉన్న వారే. వారి కుటుంబీకులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీగా పనిచేశారు. తమ నియామకం పట్ల అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తామని చెప్పారు.

సీనియర్‌గా గొండుకు గుర్తింపు..

గొండు కృష్ణమూర్తి వైఎస్సార్‌సీపీలో సీనియర్ నాయకుడిగా ఉన్నారు. పార్టీ పట్ల విధేయతతో ఉంటూ తన వంతు సేవలు అందిస్తున్నారు. మూడు సార్లు డీసీఎంఎస్ చైర్మన్‌గా పనిచేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో కూడా డీసీఎంఎస్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. అంతకుముందు అంపోలు పీఏసీఎస్ అధ్యక్షుడిగా మూడు సార్లు సేవలందించారు. భార్య సౌధామణి అంపోలు గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. కృష్ణమూర్తి తండ్రి గొండు నర్సింగరావు ఎమ్మెల్సీగా, సమితి ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంగా నియోజకవర్గంలో పేరుంది.

చల్లాకు స్టేట్ పదవి..

జిల్లాలో మరో రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబానికి చెందిన చల్లా శ్రీనివాసరావుకు ఏపీ గ్రామీణ బ్యాంకులో పనిచేసిన అనుభవం ఉంది. ఈయన తాత, తండ్రులిద్దరూ ఎమ్మెల్యేలుగా పనిచేశారు. తాత చల్లా నర్సింహనాయుడు ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా సేవలందించారు. శ్రీనివాసరావు తండ్రి చల్లా లక్ష్మీణారాయణ రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. శ్రీనివాసరావు భార్య ఆలివేలు మంగా జెడ్పీ ప్లానింగ్ కమిషన్ మెంబర్‌గా, మూడు సార్లు మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు.

మహనీయుల త్యాగాలు వెలకట్టలేనివి



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహాత్మా గాంధీతో పాటు ఎంతో మంది మహానుభావులు చేసిన త్యాగాల వల్లే నేడు స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నారని, వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మహాత్మాగాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణ, పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, సెక్షన్ పర్యవేక్షకులు డి.రామమూర్తి, సురేష్, మీడియా ప్రతినిధి శాసపు జోగినాయుడు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ లైన్

- తప్పిన పెను ప్రమాదం..



ద్విచక్రవాహనాలపై తెగిపడిన 11కేవీ విద్యుత్ వైరు

టెక్కలి రూరల్: టెక్కలి సంతోషిమాత దేవాలయం ఎదురుగా ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు శుక్రవారం మధ్యాహ్నం ఒకదానొకటి రాపిడి జరడగడంతో మంటలు చెలరేగాయి. కొద్దిసేపటికే వైరు తెగి పడి కిందన ఉన్న ద్విచక్ర వాహనాలపై పడింది. దీంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. అదే సమయంలో బైకుల వద్ద ఉన్న ఇద్దరు వ్యక్తులు ఒక్కసారిగా భయంతో పరుగులు తీశారు. తమపై వైరు పడి ఉంటే పరిస్థితి ఏంటని భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న లైన్‌మేన్ విద్యుత్ సరఫరా నిలిపివేసి వైర్లు సరిచేశారు.

87 మంది పండిట్లకు పదోన్నతులు

సాక్షి ఎఫెక్ట్...



పదోన్నతుల ఉత్తర్వులను అందజేస్తున్న డీఈవో

శ్రీకాకుళం: జిల్లాలో పనిచేస్తున్న 87 మంది పండిట్లకు పదోన్నతులు కల్పిస్తూ డీఈవో రవిబాబు బుధవారం ఉత్తర్వులు అందజేశారు. వారు పనిచేస్తున్న పాఠశాలల్లోనే ఇకపై వీరంతా స్కూల్ అసిస్టెంట్లుగా కొనసాగుతారు. 'పదోన్నతులకు నోచుకోని పండిట్లు' పేరిట ఐదు రోజుల క్రితం సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో పండిత సంఘాల నాయకులు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్పందించారు. రాష్ట్రస్థాయిలో అధికారులను కలిసి సమస్యను వారి దృష్టికి తీసువెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పండితుల పదోన్నతుల సమస్యను తక్షణం పరిష్కరించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 65 మంది తెలుగు, 18 మంది ఒరియా, నలుగురు హిందీ పండిట్లకు పదోన్నతులు లభించాయి. బుధవారం డీఈవో కార్యాలయంలో పదోన్నతుల ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతులు కల్పించడం పట్ల భాషా ఉపాధ్యాయ సంస్థ నాయకులు పిసిని వసంతరావు, రంగనాయకులు, ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

6న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఈ నెల 6న స్వర్ణాంధ్ర - స్వర్ణాంధ్ర అవార్డులు ప్రదానం చేయనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డులు అందజేసేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిర్ణయించిందని, పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగులు, పబ్లిక్ రిప్రజెంటేటివ్స్, ప్రజలు.. ఇలా ఎవరు బాగా పనిచేసినా అవార్డు అందుతుందన్నారు. అన్ని శాఖలను పరిగణనలోకి తీసుకొని 51 అవార్డులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గ్రీన్ స్పాట్ ట్రాన్స్ఫర్మేషన్ 83 పాయింట్ల లక్ష్యాన్ని రెండు వారాల్లో చేరుకున్నట్లు తెలిపారు. డై అండ్ నైట్ వంతెన కింది భాగంలో ఇకపై మెడికల్ వ్యర్థాలు పారబోస్తే చర్యలు తప్పవని మెడికల్ ల్యాబ్స్, మెడికల్ షాపులు, ఆస్పత్రులను హెచ్చరించినట్లు చెప్పారు. సఫాయి మిత్ర సురక్ష శిబిర్‌లో భాగంగా పారిశుద్ధ్య కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల్లో, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రకటిస్తామన్నారు. జీఎస్టీ తగ్గింపుపై నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 19న షాపింగ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి పాత ధరలు, తగ్గింపు ధరలపై అవగాహన కల్పిస్తామన్నారు. పాఠశాలలు, ఉన్నత పాఠశాలలో జీఎస్టీ తగ్గింపు వలన ఉపయోగం గూర్చి తెలియజేస్తారన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆకాశ అంజన్న!



మడపాం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. కిందన పచ్చని పొలాలు.. పైన ఆకాశం మబ్బులు.. నడుమ అభయాంజనేయ స్వామివారు కనువిందు చేశారు. మబ్బుల మాటున ఆకర్షణీయంగా కనిపించారు. ఈ సుందర దృశ్యాన్ని పలువురు ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. – నరసన్నపేట

మహా కనకదుర్గ..విజయ కనకదుర్గ..



కొత్తూరులో ఘటాలతో తీరువీధి నిర్వహిస్తున్న భక్తులు



శ్రీకాకుళంలో మహిషాసుర మర్దిని నాట్య ప్రదర్శన

దసరా వేడుకలు అంబరాన్నంటాయి. విజయదశమి సందర్భంగా కొత్తూరులో మహిళలు ఘటాలతో తిరువీధి నిర్వహించారు. గ్రామదేవతలతో పాటు భవానీలకు చల్లదనం చేశారు. శ్రీకాకుళం కత్తెరవీధిలో రాజరాజేశ్వరీ మహాత్రిపుర సుందరి పీఠంలో నిర్వాహకులు సుసరాపు లక్ష్మీగణపతి శర్మ నేతృత్వంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరిగాయి. శివశ్రీ నృత్య కళానికేతన్ గురువు రఘుపాత్రుని శ్రీకాంత్ నృత్య దర్శకత్వంలో 35 మంది శిష్యులతో మహిషాసుర మర్దని, దేవిస్తుతి, గణేశస్తుతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. –కొత్తూరు/శ్రీకాకుళం కల్చరల్

నదిలో దూకాడు.. రక్షించాక పరారయ్యాడు..



బోటులో నుంచి యువకుడిని బయటకు తెస్తున్న రెస్క్యూ సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని కంపోస్టు కాలనీ నీళ్ల ట్యాంకు సమీప నాగావళి నదిలో ఓ యువకుడు దూకి ఆత్మహత్యకు యత్నించాడు. తీరా అగ్నిమాపక రెస్క్యూ సిబ్బంది బయటకు తీసి రక్షించాక అక్కడి నుంచి కుటుంబీకులతో పరారయ్యాడు. శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. జిల్లా అగ్నిమాపక సహాయాధికారి శ్రీనుబాబు, ఒకటో పట్టణ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు...

గార మండలం రాళ్లపేట గ్రామానికి చెందిన బాకి రమణకు ఇద్దరు కుమారులు గణేష్, రాజు(24). గణేష్ హైదరాబాద్‌లోని కంపెనీలో పనిచేస్తుండగా.. రాజు బీటెక్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో గొడవ జరిగిందని, సూసైడ్ నోట్ రాసి బయటకు వచ్చేసినట్లు అక్కడి స్థానికులు చర్చించుకుంటున్నారు. అక్కడి నుంచి నగరంలోని దమ్మలవీధి సమీపంలో కొంతమందితో కలసి యువకుడు సాయంత్రం వరకు మద్యం సేవించినట్లు తెలుస్తోంది. రాత్రి అయ్యాక రాజు తన సోదరుడైన గణేష్‌కు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పడంతో వెంటనే ఫైర్‌సర్వీస్‌కు, ఒకటో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. ఈలోగా నదిలో యువకుడు దూకేశాడు.

ఘటనా స్థలికి డీఎస్పీ..

వరదముంపుల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్న ఎస్పీ ఆదేశాలతో అప్పటికప్పుడే డీఎస్పీ వివేకానంద సైతం ఘటనా స్థలికి వెళ్లారు. అప్పటికే ఏడీఎఫ్‌వో శ్రీనుబాబు రెస్క్యూ సిబ్బందిని నదిలో బోట్‌లో పంపించారు. నదిలో ఓ మూలన ఉన్న చెట్టుకొమ్మకు వేలాడి ఉన్న యువకుని వద్దకు చేరుకున్న సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు తెచ్చారు. చీకటిమయం కావడంతో అప్పటికే అక్కడికి చేరుకున్న రాజు కుటుంబీకులు ముగ్గురు తుప్పల మధ్య నుంచి తీసుకెళ్లి బండిపై వెళ్లిపోయారు. దీనిపై రూరల్‌సీఐ పైడపునాయుడు మాట్లాడుతూ యువకుడు క్షేమంగా ఉన్నట్లు చెప్పారు.

పగలు వ్యాపారం.. రాత్రి దొంగతనం

- ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న యువకుడిని పట్టుకున్న గ్రామస్తులు



యువకుడిని ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు రూరల్ : పగటి పూట ద్విచక్రవాహనంపై గ్రామాల్లో తిరుగుతూ వంట సామగ్రి వ్యాపారం చేస్తూ.. రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్న ఓ యువకుడు ఎట్టకేలకు గ్రామస్తుల చేతికి చిక్కాడు. గురువారం రాత్రి వజ్రపుకొత్తూరు మండలం అనకాపల్లి వద్ద కొండమహంకాళీ అమ్మవారి గుడి వద్ద చోరీకి ప్రయత్నిస్తూ ఓ యువకుడు స్థానికులకు పట్టుబడ్డాడు. గ్రామస్తులు ప్రశ్నించగా దొంగతనానికి వచ్చినట్లు అంగీకరించాడు. మందస మండలంలోనూ పలు ఆలయాల్లో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. యువకుడి వద్ద ఉన్న ద్విచక్రవాహనం, దొంగతనాన్ని వినియోగించే పనిముట్లు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని శుక్రవారం పోలీసులకు అప్పగించారు. ఆధార్‌కార్డు ప్రకారం నరసన్నపేటకు చెందిన కల్లూరి ప్రభదాసుగా స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ఘటనా స్థలంలో ఆటోలు

నరసన్నపేట : జాతీయ రహదారిపై కోమర్తి పెట్రోల్ బంకు వద్ద గురువారం ఆగి ఉన్న ఆటోను వెనుక వస్తున్న మరో ఆటో అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో వెనుక ఆటోలో ఉన్న అంపోలు గ్రామానికి చెందిన ధర్మాన సంధ్య, దంత జయశ్రీ, దంత కనకమహలక్ష్మి, జమ్ము రాజేశ్వరమ్మలకు గాయాలయ్యాయి. వీరంతా పోలాకి మండలం గొల్లవలస వెళ్లేందుకు మునసబుపేటలోని గాయత్రీ కళాశాల వద్ద ఆటో ఎక్కారు. దేవాది దాటిన తర్వాత పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి ముందున్న ఆటోను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు.